క్లుప్తంగా

రాహుకేతువులకు విశేష పూజలు



నకరికల్లు: మండలంలోని నర్సింగపాడులో గల శ్రీ అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం రాహుకేతు పూజలు నిర్వహించారు. అర్చకులు కొమ్మవరపు పవన్‌కుమార్‌శర్మ ఆధ్వర్యంలో రాహుకేతువులను విశేషంగా అలంకరించారు. అమావాస్య కూడా ఆదివారంతో కలసి రావడంతో ప్రత్యేకత సంతరించుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోనే మహిమ గల రాహుకేతువుల ఆలయంగా ప్రసిద్ధికెక్కడంతో దోషనివారణ కోసం పల్నాడు జిల్లాతో పాటు గుంటూరు జిల్లాలోని పలు గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. నూతన దంపతులు, వృత్తి, వ్యాపారాల్లో దోషాల నివారణకు భక్తులు అధికంగా వచ్చినట్లు అర్చకులు తెలిపారు.

గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



అమరావతి: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఆదివారం ఆచార్య ప్రబోధానంద విరచిత త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని నర్సారావుపేట త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి నిర్వహించింది. సంస్థ అధ్యక్షుడు ఘడియం పెద్దరెడ్డి, రాజశేఖర్, రమేష్ , వెంకటేశ్వర్లు, చిన్నవెంకయ్య, భాస్కరరావు, పోతురాజుతో కలసి 60మంది భక్తులు మండలంలోని తురగావారిపాలెం, మునగోడు, జూపూడి గ్రామాల్లో ప్రచారం చేశారు. త్రైత భగవద్గీతలో పలు ఆధ్యాయాల్ని భక్తులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు పెద్దిరెడ్డి మాట్లాడుతూ సర్వమతాలకు దేవుడు ఒక్కడేనని, అందరిలో భక్తిభావం పొంపొందించడానికే ఈ ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

దాడిలో వృద్ధుడికి తీవ్ర గాయాలు



ముప్పాళ్ల: కుటుంబ కలహాల నేపథ్యంలో వృద్ధుడిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన ముప్పాళ్లలో ఆదివారం జరిగింది. గ్రామంలోని ముస్లిం కాలనీకి చెందిన సయ్యద్ నాగూల్ మీరా, పఠాన్ చాంద్ బాషా బావ, బామ్మర్ది అవుతారు. నాగూల్‌మీరా తన ఇంట్లో పిల్లల్ని మందలిస్తుండగా, పక్కనే నివసిస్తున్న పఠాన్‌చాంద్ బాషా కుటుంబ సభ్యులు తమనే దూషిస్తున్నాడనే నెపంతో వాదనకు దిగారు. ఇద్దరి మధ్యా వాదనలు ముదిరి నాగూల్ మీరాపై పఠాన్ చాంద్ బాషా, చిన్న కుమారుడు పఠాన్ అబ్దుల్ మునిఫ్ ఇనుప రాడ్డుతో దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైంది. గాయపడిన నాగూల్ మీరాను సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. జరిగిన సంఘటనపై నాగూల్ మీరా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. విచారణ జరుపుతున్నట్లు ఎస్‌ఐ ఎస్.కె.ఇమామ్ తెలిపారు.

నేడు ఏరియా వైద్యశాలలో రక్తదాన శిబిరం

సత్తెనపల్లి: స్థానిక ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్పత్రిలో సోమవారం ఉదయం 9 గంటలకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శిబిరాన్ని ప్రారంభిస్తారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా రక్తదానం చేయాలని వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ కోరారు.

నాడు అధ్వానం.. నేడు వైభవం

- తాళ్లచెరువు అంబేద్కర్ కాలనీకి మోక్షం
- నాడు మట్టిరోడ్లు - నేడు సిమెంట్ రోడ్లు
- పూరి పాకల స్థానంలో పక్కా గృహాలు
- రూ.35లక్షలతో రోడ్లు, సైడ్ డ్రెయిన్స్
- మెయిన్ రోడ్డు నుంచి కాలనీ వరకు వీధి దీపాలు



నాడు.. గతంలో ఉన్న మట్టి రోడ్డు



నేడు... అంబేద్కర్ కాలనీలో కొత్తగా వేసిన సిమెంటు రోడ్డు

అచ్చంపేట: మండలంలో మారుమూల గ్రామం తాళ్లచెరువు. వ్యవసాయ ప్రాధాన్యత గల ఆ గ్రామంలో ఒక ఎస్సీ కాలనీ, దాన్ని ఆనుకుని మరో మూల ఏ ఆదరణకు నోచుకోని అంబేడ్కర్ కాలనీ ఉంది. సుమారు 100ఇళ్లలో 300మందికి పైగా నివసిస్తున్నారు. ఒకప్పుడు అంబేడ్కర్ కాలనీలో ఏ సౌకర్యం ఉండేది కాదు. చిన్నపాటి వర్షం పడినా మట్టి రొడ్లన్నీ బురదమయంగా మారేవి. కనీసం నడిచేందుకు కూడా వీలుండేది కాదు. కాలనీలో అన్నీ పూరి పాకలే ఉండేవి. మెయిన్ రోడ్డు నుంచివీధిదీపాలు కూడా లేవు. రాత్రిపూట బయటకు రావాలంటే పాముల భయం. బతుకు భయంగా ఉండేది. కాలనీవాసులకు సొంత స్థలాలున్నా పక్కా గృహాలకు నోచుకోలేదు. మంచినీటి సౌకర్యం ఉండేది కాదు. కనీస వసతులు కల్పించమని కాళ్లరిగేలా అధికారులు, పాలకులు చుట్టూ ప్రదక్షిణ చేసినా స్పందన లేదు. ఇవన్నీ గత టీడీపీ ప్రభుత్వంలో ప్రజల కష్టాలు.

నేడు సకల సౌకర్యాలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే కాలనీకి వసతులు ఒనగూరాయి. వీధి దీపాలు వచ్చాయి. పక్కా గృహాలు మంజూరు చేయించారు., నీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించారు. ఇటీవల సిమెంటు రోడ్లు వేయించి, సైడ్ డ్రైయిన్స్ కూడా నిర్మించారు.

స్పందించిన ఎమ్మెల్యే శంకరరావు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాగానే స్థానిక ఎమ్మెల్యే కాలనీ సందర్శనకు వచ్చినప్పుడు నివాసితులంతా తమ గోడు వినిపించారు. వెంటనే విద్యుత్ అధికారుల్ని ఆయన పిలిపించి గ్రామంలోని మెయిన్ రోడ్డు నుంచి విద్యుత్ స్తంభాలు వేయించి, దీపాలు బిగించారు. వాడుకునేందుకు కూడా నీళ్ల లేకపోవడంతో బోరు బావి తీయించారు.

రోడ్ల నిర్మాణానికి రూ.35 లక్షలు మంజూరు

కాలనీకి మెయిన్ రోడ్డుతో పాటు ఏడు అడ్డ రోడ్లు ఉన్నాయి. అన్ని మట్టి రోడ్లే. గుంతల మయం. వర్షం పడితే కనీసం నడిచేందుకు కూడా వీలుండేది కాదు. దీంతో ఎమ్మెల్యే శంకరరావు ఎంపీ నిధులు రూ.15లక్షలు, సీఎండీఎఫ్ నిధులు రూ.10లక్షలు, జిల్లా పరిషత్ నిధులు రు.10లక్షలు మంజూరు చేయించారు. వీటితో ప్రస్తుతం 400మీటర్ల నిడివిగల ఏడు అడ్డ రోడ్లలో పక్కా సిమెంట్ రోడ్లు వేశారు. మరో 300 మీటర్ల నిడివిగల కాలనీ మెయిన్ రోడ్డు వేయాల్సి ఉంది. సొంత స్థలాలున్న వారందరికీ పక్కా గృహాలు మంజూరు చేశారు. కొంత మంది పూర్తి స్థాయిలో నిర్మించుకోగా, మరికొంత మంది ఇళ్ల నిర్మాణ దశలో ఉన్నాయి. ఇప్పుడు ఆ కాలనీలో ఏ సమస్యా లేదు. విద్యుత్ దీపాలు, పక్కా రోడ్లు, మంచి నీటి వసతి కల్పించడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



ప్రభుత్వం నిర్మించిన పక్కా గృహం

జగనన్నకు రుణపడి ఉంటాం



ఒకప్పుడు కాలనీలో ఉండాలంటేనే భయపడాల్సి ఉండేది. అన్ని మట్టిరోడ్లే. వర్షం పడితే గుంతల రోడ్డుపె నడిచేందుకు కూడా వీలుండేది కాదు. ద్విచక్ర వాహనాలపై వెళ్లడం అస్సలు సాధ్యపడేది కాదు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాతే మా సమస్యలకు పరిష్కారం దొరికింది.

– దారా మోహనరావు, అంబేడ్కర్ కాలనీ, తాళ్లచెరువు

చీకటి నుంచి మోక్షం



మా కాలనీ ఏర్పడి 20సంవత్సరాలైంది. ఇన్నాళ్లకు ఊళ్లో నుంచి వీధి దీపాలు వేశారు. గతంలో గత ఎమ్మెల్యేని, అధికారుల్ని అడిగి అడిగి వేశారిపోయాం. ఎమ్మెల్యే నంబూరు శంకరరావుకు చెప్పగానే విద్యుత్ అధికారుల్ని పిలిపించి లైట్లు వేయించారు.

– పెరికల శౌరిబాబు, అంబేడ్కర్ కాలనీ, తాళ్లచెరువు

ప్రభుత్వ డబ్బులతో ఇల్లు కట్టుకున్నా ..



నాకు రెండున్నర సెంట్లు స్థలం ఉంది. చిన్న పూరిగుడిశెలో మనమళ్లు, మనమరాళ్లతో ఉండలేక ప్రభుత్వ పక్కా గృహం కట్టించమని ఎంతో ప్రాథేయపడ్డా. అయినా పట్టించుకోలేదు. జగన్ సీఎం కాగానే వలంటీరు వచ్చి కట్టుకుంటావా అని అడిగి మరీ నా పేరు రాశారు. ఇల్లు మంజూరైంది. ముఖ్యమంత్రి జగన్ దయవల్ల ఇల్లు వారం, పది రోజుల్లో పూర్తవుతుంది. బిల్లులు కూడా ఎప్పటికప్పుడు ఇస్తున్నారు.

– దారా రమణ, గృహిణి, అంబేడ్కర్ కాలనీ, తాళ్లచెరువు.

కార్యసిద్ధి ఆంజనేయుడికి పూజలు



సత్తెనపల్లి: రాష్ట్రంలో వర్షాలు సకాలంలో పడి, పంటలు పండి సస్యశ్యామలంగా ఉండాలని, ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని కోరుతూ పట్టణంలోని నాగన్న గుంటలో గల కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ఆదివారం పంచామృత స్నపన, 108 కలశాలతో అభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్దఎత్తున రైతులు, గ్రామస్తులు భాగస్వాములయ్యారు. భక్తులకు ఆటంకం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శ్మశానవాటికలో జంగిల్ క్లియరెన్స్



సత్తెనపల్లి: పట్టణంలోని శ్మశానవాటికలో ఆదివారం 19వ వార్డ్ కౌన్సిలర్ అవ్వారు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జంగిల్ క్లియరెన్స్ చేపట్టారు. శ్మశానవాటికలో రాకపోకలకు ఇబ్బందిగా ఉందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకురావడంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిశుభ్రత చర్యలు చేయించారు. ప్రత్యేకంగా పొక్లెయిన్‌తో కంప, పిచ్చి చెట్లను తొలగించారు. ఆయనతో పాటు వైఎస్సార్ సీపీ నేత అనుముల శ్రీనివాసరావు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఆర్టీసీ బస్సు పాసులు పొందండిలా !

- సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రత్యేక కౌంటర్
- ఏటా ఐదు వేల మందికి పాసులు
- ఆన్‌లైన్‌లో సైతం దరఖాస్తుకు అవకాశం



సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్

సత్తెనపల్లి: పాఠశాలలు ఈ నెల 12 నుంచి పునఃప్రారంభం అయ్యాయి. కొత్త విద్యా సంవత్సరానికి సంబంధించి విద్యార్థులకు బస్సు పాసుల జారీ ప్రక్రియను ఇప్పటికే ఆర్టీసీ అధికారులు ప్రారంభించారు. సత్తెనపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో స్థానిక బస్టాండ్‌లో ఈనెల 15 నుంచి ఈ ప్రక్రియ ప్రారంభించారు. తమ పరిధిలో ఏటా సుమారు 5 వేల మంది విద్యార్థులకు జారీ చేస్తున్నామని, కొత్త విద్యాసంవత్సరానికి సంబంధించి ప్రస్తుతం ప్రారంభించామని సత్తెనపల్లి ఆర్టీసీ డిపో మేనేజర్ జీఎస్‌వీవీ కుమార్ తెలిపారు. ఉచిత, చెల్లింపు పాసుల కోసం దరఖాస్తు ఫారాలు పూర్తిచేసి అందజేయాలని ఆయన సూచించారు. ఆన్‌లైన్‌లో కూడా పొందవచ్చని చెప్పారు.

ఉచిత పాసులకు అర్హులు..

→ విద్యార్థి ఇంటి నుంచి పాఠశాలకు 20 కిలోమీటర్ల దూరం ఉంటేనే ఉచిత పాసు జారీ చేస్తారు.
→ ఏడో తరగతి వరకు చదివే 12 ఏళ్లలోపు బాలురు, పదో తరగతి వరకు చదివే 18 ఏళ్లలోపు బాలికలు అర్హులు.
→ వచ్చే ఏడాది ఏప్రిల్ నెలాఖరు వరకు చెల్లుబాటు అవుతాయి. దరఖాస్తు ఫారంపై పాస్ పోర్టు సైజు ఫొటో అంటించి ప్రధానోపాధ్యాయుడి సంతకంతో పాటు స్టాంపు వేయించాలి.
→ పూర్తి చేసిన దరఖాస్తుకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు నకలు జతచేయాలి.
→ సర్వీసు ఛార్జీగా రూ .50 చెల్లించాలి.

స్టూడెంట్ పెయిడ్ పాసులకు అర్హులు

→ నెల, మూడు నెలలు, సంవత్సర కాల వ్యవధికి చెల్లుబాటయ్యే స్టూడెంట్ పెయిడ్ పాసులు కోసం పాఠశాల , కళాశాలల విద్యార్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవచ్చు.
→ ఇంటికి, తాము చదివే పాఠశాల, కళాశాలకు మధ్య దూరం 50 కిలోమీటర్లు ఉండాలి.
→ ఇంటి నుంచి విద్యాసంస్థకు మధ్య ఉన్న దూరం , కాలవ్యవధిని బట్టి ధర ఉంటుంది.
→ దరఖాస్తు ఫారంలో పైన పాస్‌పోర్టు సైజు ఫొటో, కింద ఉండే బోనఫైడ్ సర్టిఫికెట్‌పై మరొకటి అంటించి ప్రధానోపాధ్యాయుడు/ ప్రిన్సిపల్ సంతకంతో పాటు స్టాంపు వేయించాలి.
→ పూర్తి చేసిన దరఖాస్తుకు ఒరిజినల్ స్టడీ సర్టిఫికెట్, పదో తరగతి మార్కుల జాబితా, ఆధార్ కార్డు నకలు జత చేయాలి.
→ మొదటిసారి ఏ కాలపరిమితితో పాసు తీసుకున్నారో తర్వాత రెన్యూవల్ పాస్ కూడా అదే కాలపరిమితికి జారీ చేస్తారు. రెన్యూవల్‌కు సర్వీసు చార్జీగా రూ.40 అదనంగా చెల్లించాల్సి ఉంటుంది.

ఆన్‌లైన్‌లోనూ సదుపాయం

ఏపీపీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్‌లోకి వెళ్లి వివరాలు నమోదు చేయడంతో పాటు నిర్ణీత రుసుం కూడా ఆన్‌లైన్‌లోనే చెల్లించి తర్వాత ప్రింట్ తీసుకోవాలి. దానిని కౌంటర్లో అందిస్తే ఆన్‌లైన్ కోడ్ నంబరు ద్వారా పాస్ జారీ చేస్తారు. బస్సు పాసులకు సంబంధించి అదనపు సమాచారం, దరఖాస్తు ఫారాల కోసం సత్తెనపల్లి ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న కౌంటర్ వద్ద సంప్రదించొచ్చు. మరిన్ని వివరాలకు 99592 25429, 63049 59773 నంబర్లలో సంప్రదించి సమాచారం తెలుసుకోవచ్చు.

మాజీ మావోయిస్టు పద్మను వెంటనే విడుదల చేయాలి

ఏపీ పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్



బల్లల పద్మ

సత్తెనపల్లి: మాజీ మావోయిస్టు బల్లల పద్మను వెంటనే విడుదల చేయాలని ఏపీ రాష్ట్ర పౌర హక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి చిలుకా చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. గుంటూరు సమీపంలోని వెంగళాయపాలెంలో స్నేహితురాలి ఇంటి వద్ద ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో యూనిఫాం ధరించిన ఐదుగురు పోలీసులు, ఓ మహిళా కానిస్టేబుల్ వచ్చి జీపులో విజయవాడ వైపు పద్మను తీసుకెళ్లారన్నారు. ప్రముఖ దినపత్రిక జర్నలిస్టు, మాజీ మావోయిస్టు పద్మ సుదీర్ఘకాలం జైలులో ఉండి కేసులన్నీ కొట్టివేసిన తర్వాత లా డిగ్రీ పూర్తిచేసి ప్రస్తుతం పీజీ చదువుతోందని చెప్పారు. అనుమానంపై విచారణకు తీసుకువెళ్లి ఉంటే ఆమెను వెంటనే విడుదల చేయాలని చంద్రశేఖర్ కోరారు. ఎందుకు ? ఎవరు ?ఎక్కడికి తీసుకు వెళుతున్నారనే విషయాలు పోలీసులు తెలియజేయక పోవడం చట్ట వ్యతిరేకమని తెలిపారు. ఉన్నతాధికారులు పద్మను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

సొంతింటి కల సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి



పట్టాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: గూడులేని ప్రతి పేదవానికి నివేశన స్థలం ఇచ్చి ఇల్లు కట్టించడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి (పీఆర్కే) అన్నారు. కారెంపూడి గ్రామ శివారు తండాలో ఇల్లు లేని 40 మంది నిరు పేదలకు నివేశన స్థలాల పట్టాలు ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదివారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వ మాట్లాడుతూ గత ప్రభుత్వం ఏ ఒక్కరికి నివేశన స్థలం ఇవ్వలేకపోయిందని పేదలు అర్జీలిచ్చినా ప్రభుత్వం వాటిని బుట్టదాఖలు చేసిందన్నారు. గూడు లేక పేదలు పడుతున్న ఇబ్బందులు గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. దీంతో పేదలు ఎంతో కాలంగా నివేశన స్థలాల కోసం ఎదురు చూస్తున్నారని, ప్రస్తుతం పేదల మనసెరిగిన జగనన్న ప్రభుత్వం పేదవాడి కష్టాలు తెలుసుకుని ఇల్లులేని ప్రతి పేదవాడికి నివేశన స్థలం ఇచ్చి లక్షలాది ఇల్లు కట్టించే బృహత్తర కార్యక్రమం చేపట్టిందని ప్రభుత్వ విప్ పీఆర్కే పేర్కొన్నారు. ఒక్క కారెంపూడిలోనే దాదాపు వెయ్యికి పైగా నివేశన స్థలాల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. పట్టాలిచ్చిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లో అన్ని ప్రాథమిక సౌకర్యాలు కల్పించి ఇళ్ల నిర్మించి ఇవ్వనున్నట్లు చెప్పారు. చిరకాలంగా ఉన్న పేదల సొంతింటి కలలను జగనన్న ప్రభుత్వం సాకారం చేసిందన్నారు. అంతకు ముందు కారెంపూడి శివారులో వైఎస్సార్ జగనన్న కాలనీలో నాలుగు బోరు బావుల తవ్వకాలను ప్రభుత్వ విప్ పీఆర్కే ప్రారంభించారు. బోర్లు వేసిన అనంతరం గృహనిర్మాణాలు ప్రారంభించాలని అధికారులను ప్రభుత్వ విప్ పీఆర్కే ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి శ్రీనివాసయాదవ్, సర్పంచ్ రమావతు ప్రమీలాబాయి తేజానాయక్, ఎంపీపీ మేకల శారదాశ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ షేక్ షఫీ, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ షేక్ అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు షెల్టర్స్ ఏర్పాటు



తాత్కాలిక షెల్టర్స్ ఏర్పాటు చేస్తున్న స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధులు

అచ్చంపేట: మండలంలోని పెదపాలెంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో నిరాశ్రయులైన బాధిత కుటుంబాల్ని ఆదుకునేందుకు ఇటు ప్రభుత్వం, అటు స్వచ్ఛంద సంస్థలు ముందుకొస్తున్నాయి. ప్రభుత్వం పక్కా గృహం మంజూరు చేస్తే, అప్పటి వరకు తలదాచుకునేందుకు స్నేహ హస్తాలు ఫౌండేషన్ తాత్కాలిక షెల్టర్స్ నిర్మించేందుకు కావలసిన సామగ్రిని ఆదివారం బాధిత కుటుంబాలకు అందజేసింది. పూర్తిగా కాలిపోయి, తలదాచుకునేందుకు కూడా అస్కారంలేని గంటెల పేరయ్య, కట్టా స్వామి, జడా ఏసు, జడా రామారావు, దాములూరి మేరమ్మ, సల్లూరి వెంకట్రావు కుటుంబాలకు పక్కా గృహాల నిర్మాణాలు పూర్తయ్యేంత వరకు తాత్కాలికంగా ఉండేందుకు రూ.3.50లక్షల వ్యయంతో షెల్టర్స్ ఏర్పాటు చేశారు. ఆరు కుటుంబాలకు సిమెంటు పోల్స్, రేకులు, కడ్డీలు, సిమెంటు బస్తాలు వగైరా వస్తువులు పంపిణీ చేశారు. విద్యుత్, ఫ్యాను,రెండు ఎల్ఈడీ బల్బులు వంటి సౌకర్యాలతో ఒకటి, రెండు రోజుల్లో షెల్టర్స్ పూర్తి చేసి బాధిత కుటుంబాలకు అప్పగిస్తామని స్నేహ హస్తాలు ఫౌండేషన్ ప్రతినిధి తాయి కరీముల్లాబాబు తెలిపారు.

నేడు డస్ట్‌బిన్ల పంపిణీ

సత్తెనపల్లి: పట్టణంలోని 15వ వార్డు వడ్డవల్లి ఆంజనేయస్వామి దేవాలయం వద్ద సోమవారం ఉదయం 6 గంటలకు డస్ట్‌బిన్ల పంపిణీ చేయనున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మున్సిపల్ చైర్‌పర్సన్ చలంచర్ల లక్ష్మీ తులసి హాజరవుతారన్నారు. పట్టణంలోని వైస్ చైర్మన్లు, అన్ని వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ కోరారు.

వడదెబ్బ తగిలి రైతు మృతి



క్రోసూరు: వడదెబ్బకు గురై ఓ రైతు ఆదివారం మృతి చెందిన ఘటన క్రోసూరులో జరిగింది. ఉదయం మర్రి పాపిరెడ్డి(57) గేదెలు తోలుకుని పొలానికి వెళ్లాడు. సాయంత్రం నీరసంతో అక్కడే పడిపోయాడు. చుట్టుపక్కల వారు చూసేసరికి అప్పటికే మృతి చెందాడు.పాపిరెడ్డికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో వడదెబ్బ తగిలి మృతి చెందాడని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

సాగరమాత దేవాలయంలో భక్తుల సందడి



విజయపురిసౌత్: సాగరమాత ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సాగర్‌మాత పుణ్యక్షేత్రానికి తరలి వచ్చారు. మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే సాగరమాత ఆలయంలో భక్తులు మొక్కుబడులు జరుగుతున్నాయి. ఉదయం భక్తులు కృష్ణానదిలో స్నానమాచరించి ఆలయ విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్ బాలసాగర్ ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యబలి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ఆవరణలో తేరు ప్రదక్షణ నిర్వహించారు. ఆ తరువాత జపమాల క్షేత్రంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కళాశాల నూతన భవనం



నూతన భవనం ఏరియల్ వ్యూ

కొత్త భవనంలో కొలువుదీరిన పాలిటెక్నిక్ కళాశాల

క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల భవనం పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చింది. ప్రిన్స్‌పాల్ కార్యాలయం, స్టాఫ్ రూం, ఆఫీస్ రూం, లాబ్స్‌తో పాటు తరగతుల కోసం మొత్తం 26 గదుల నిర్మాణం పూర్తయింది. కొత్త భవనంలో తరగుతులు కూడా జరుగుతున్నాయి. ప్రస్తుతం డిప్లొమా ఇన్ సివిల్ ఇంజనీర్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్స్ అండ్ ఎలక్ట్రానిక్స్ కోర్సులు నిర్వహిస్తున్నారు. ఇక్కడే నియోజకవర్గ స్థాయిలో ఏపీ స్కిల్స్ డెవలప్‌మెంట్ కోర్సులు ఏర్పాటు చేసి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు తెలిసింది.

- క్రోసూరు



తరగతి గదులు

విద్యుత్ చార్జీల భారంపై 24న రౌండ్ టేబుల్ సమావేశం

సత్తెనపల్లి: పెంచిన విద్యుత్ చార్జీల్ని వెంటనే తగ్గించాలని సీపీఎం సీనియర్ నాయకుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. పట్టణంలోని పుతుంబాక భవన్‌లో ఆదివారం జరిగిన సీపీఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమావేశానికి పార్టీ నేత షేక్ మస్తాన్‌వలి అధ్యక్షత వహించారు. చలమయ్య మాట్లాడుతూ ఈ నెల 24న అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో పుతుంబాక భవన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చెత్త పన్ను, ఆస్తి పన్ను, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు, నిత్యవసర వస్తువుల ధరల పెరుగుదలతో సతమతమవుతున్న పేదలకు విద్యుత్ చార్జీలు మరింత పెనుభారంగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో సీపీఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ సభ్యులు కట్టా శివ దుర్గారావు, అనుముల వీరబ్రహ్మం, ఎం.హరిపోతురాజు, పంతంగి ప్రభాకర్, గద్దె ఉమాశ్రీ , జడ రాజకుమార్, రొంపిచర్ల పురుషోత్తం, మామిడి జగన్నాథరావు పాల్గొన్నారు.